## మనిషి విలువ డబ్బుతో కొలిచే మనుషుల మధ్య వుంటూ అతను తన విలువను ఎలా పెంచుకున్నాడు?

# రాగతిరమ కథ

# మనిషి — మనసు

భోరున వర్షం— రివ్వున చలిగాలి. అనంత రామయ్యలేచి కూర్చున్నాడు. వరండాలో జల్లుకొడుతూవుంది. చలి—చలి. గుండెల్లోకి దూసుకెళ్తూ వుంది చలి.

"రంగయ్యా"! పిల్చాడు పనిపిల్లాడిని.

వాడెక్కడో లోపల వెచ్చగా పడుకొని వుంటాడు. లోపల గదిలోనుండి గడియారం 2 గంటలు కొట్టిన చప్పుడైంది. "రంగయ్యా"! మళ్ళీ పిల్చాడు. వేసివున్న తలుపులు తెరుచుకోలేదు. వర్షం నీరు ధారగా వరండాలోకి చొచ్చుకొస్తూవుంది. ...ని గుండెల్లో బాధ పొంగుకొస్తూ వుంది.

"అన్నపూర్ణ తలుపుతీయ్" గట్టిగా అర్చాడు తలుపుతట్టుతూ. దబదబ వర్షం. మిన్నువిరిగిమీద పడ్డట్టు ఫెళఫెళమంటూ వురుములు. ఒళ్ళు జలదరింపజేసే మెరుపులు.

"ఎక్కడ వచ్చారు వీళ్ళంతా?" విసుక్కున్నాడు.

మంచం చాలా వరకు తడిసిపోయింది. గోడవారకు జరిపాడు మంచాన్ని. ఒదిగి కూర్చొని, దుప్పటి తీసి కప్పుకొని చుట్టవెలిగించుకున్నాడు. చీకట్లో మిణుగురులా మెరుస్తూ వుంది చుట్ట. అలవాటులేని చుట్ట ఇప్పుడు అలవాటైపోయింది.

ఆకాశం గుండెల్లో ఎవరో కత్తితో పొడిచారేమో అందుకే అంత కన్నీరు కారుస్తూవుందేమో! అనంత రామయ్యకి అనిపించింది. అలా వర్షాన్ని చూస్తూవుంటే ఏదో తెలియని దుఃఖం గుండెల్ని దొలిచేస్తూ వుంది.



ఒకఏడాది క్రితం వరకు జీవితాన్ని డాబుగా, దర్జాగా, సర్దాగా, సంతోషంగా గడిపాడు. భార్య, ఇద్దరు కొడుకులు, కోడళ్ళు అతనేంచెబితే అదే వేదవాక్యం. అతని అభీష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగలేదు.

అప్పుడు అతను ఇంజనీర్ అనంతరామయ్య. ముక్కుసూటిగా వెళ్ళే

అనంతరామయ్య. కం(ట్రాక్టర్ల గోల.

''బాబూ అనంతరామయ్యా ఏదో చూసీ చూడకుండా వెళ్ళి మమ్మల్ని రక్షించి నీకు కావలసినది తీసుకో...''

తన దగ్గిర వాళ్ళమాటలు సాగవన్నట్లు నసేమిరా అని భీష్మించుకు కూర్చున్నాడు. అతని (ప్రవృత్తికది విరుద్ధం.

''భార్యా పిల్లలంటే మీకే మా(తం (ప్రేమున్నా అలా అనరు'' అన్నపూర్ణ ఏడుస్తూ అంది.

అసలు ఇదంతా ఎవరికోసం? భార్యా, పిల్లలు వారి సౌఖ్యం అంతేకదా! వారికోసమే కదా ఈ తపనంతా ఆత్మజ్ఞానం అయినట్లు.

''నాకు మా(తం ఈ పనిచేసి పెట్టి నువ్విది తీసుకోవయ్యా బాబూ''అన్నవాళ్ళకు కాదనడం మానేసాడు.

ఇల్లుకట్టించాడు భార్యపేరుమీద. సంపాదించి నదంతా కొడుకులిద్దరి పేరుమీద బ్యాంకులో వేసాడు.

గుండెల్లో అశాంతి.

అనంతరామయ్య లేచి వరండాలో అటు ఇటు తిరిగాడు. వరండా అంతా తడి అసహ్యంగా. అప్పుడు అంటే రిటైర్ అవ కముందు రగ్గు వెచ్చగా కప్పుకోవడానికి నీట్‌గా అమర్చిన గది (ప్రత్యేకంగా గతించిన గతం ఓ వెన్నెలనీడ అనంతరామయ్య కళ్ళుమూసుకున్నాడు. వుక్కిరిబిక్కిరిగా దగ్గు ఖణేలుఖణేలుమంటూ. ఓహో ఇది మా(తం నాకు తోడు వస్తానంటూ వుందా? అతనికెందుకో విపరీతమైన నవ్వు వచ్చింది.

''ఏమండీ వర్షం పడుతూ వుంది చల్లగాలికి వొళ్ళు పాడవుతుంది వెళ్ళిలోపల పడుకోండి. అదిగో అప్పుడే దగ్గుతున్నారు. ఇలా రండి లోపలికి— ఇదిగో రగ్గు కప్పుకున్నాను వెచ్చగా తెల్లారితే మళ్ళీ ఆఫీసుకు పరుగులు ఒక్కరోజు రెస్ట్‌లేదు కదా!''

వరండాలో పడుకున్న రోజు వర్షం వస్తే అన్నపూర్ణ ఆరాటం.

రెండుచేతులా సంపాదించే అనంతరామయ్య విలువ మరి ఎక్కువ కదూ! ఎందుకు కాదు... అది డబ్బుకున్న విలువ— డబ్బుకున్న మహత్యం! ఓ డబ్బు విన్ను సంపాదించే వయసు దాటిపోతే ఈ అనంతరామయ్య విలువకూడా దాటిపోయిందా? అందువల్ల యు అర్ (గేట్ నవ్వుకున్నాడు పిచ్చివాడి లాగ.

''నాన్నా ఫారన్ టేపురికార్డర్ మా(ఫెండొకడు అమ్మదామనుకుంటు న్నాడు. తీసుకుందామా! వద్దా, చెప్పండి''! అడిగాడు పెద్దకొడుకు గిరి.

''నీకు బాగుంటే తీసుకో బాబూ!''

''ఆహా... అలా అనొద్దు నాన్నగారూ మీరు వూ అంటేనే తీసుకువేది. లేదు వ దిలేస్తాను''.

తన ఆజ్ఞలేకుండా ఏపనీ చేయదు. పొంగిపోయిన క్షణాలు.

''మామగారూ మీరు మరీ వీక్‌గా అయిపోతున్నారు. ఇకనుండి బాబుతోపాటు హార్లిక్సు కలిపి ఇస్తాను రెండు పూటలా'' కోడలు అనురాగంతో చూపిన ఆజ్ఞ అనురాగపుజల్లులో తడిసిన క్షణాలు.

ఒక్కరోజు నలతగా వుండి ఆఫీసుకు సెలవు పెట్టినందుకు ఇంట్లోవాళ్ళు గాభరా.

వీళ్ళునావాళ్ళు— నా మనుష్యులు— ఇంతటి ఆప్యాయత— అనురాగం ఎంత ఖర్చు చేస్తే లభ్యం.

''నాన్నగారు ఇప్పుడే వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను'' చిన్నకొడుకు హరి ఆరాటం.''ఒద్దురా'' అంటే ''అలాగే అంటారు డాక్టర్ని తీసుకురా అబ్బాయ్ హరీ'' గాభరాపడుతూ అన్నపూర్ణ,

డాక్టర్ వచ్చి మందులిచ్చి వెళ్ళిన తర్వాత, ఒంట్లో హుషారుగా వున్న నాలుగురోజులవరకు ఆఫీసుకు వెళ్ళనిస్తేనా?

కాళ్ళుపట్టేవాళ్ళు—కబుర్లు చెప్పేవారు నవ్వించే వారు నాస్తా తినిపించేవారు..

ఎంతమందికి వుంటుంది ఇంతటి అదృష్టం.

వెన్నెట్లో వికశిస్తున్న పారిజాతాలను చూస్తుంటే కలిగే హాయి, తృప్తి...

ఒకరోజు భోజనానికి కూర్చున్నాడు. వడ్డిస్తూ నేలక్కూర్చుకుంది అన్నపూర్ణ. మీరు గుడ్డు తినరుగా నా మతిమండ, మరిచిపోయి గుడ్డు కూర వండమన్నాను.

ఫర్వాలేదులే ఈపూటకి తక్కినకూరలు వున్నాయిగా అన్నాడు తను.

''సరే మీరు తిన్నట్టే. రెండు నిమిషాలు ఓపిక పట్టండి'' అన్నపూర్ణ 5 నిమిషాల్లో ఆమ్లెట్లు పోసి తెచ్చింది. అతనికి చాలాగొప్పగా అనిపించింది. తానెంతో అధికుడనని పించింది.

''సరిపోయింది సంబడం ఆ తడిలో, చలిలో అలాపడుకునే బదులు తలుపుకొట్టి లేపితే రంగయ్యగాని, నేనుగాని తలుపు తీసేవాళ్ళం కదా!'' ఈ లోకంలోకి వచ్చాడు అనంతరామయ్య.

తలుపుతీసి చిరాగ్గా చూస్తూ నిలబడివుంది ఒకప్పటి అనురాగ దేవత అన్నపూర్ణ.

''తట్టాను'' అనలేదు అనంతరామయ్య.

అపుడే తెల్లారిపోయింది అనుకున్నాడు. ఆకాశం ఒళ్ళు విరుచుకుంటూ వుంది. వర్షం ఆగిపోయింది. తడిసిన కాకి ఒకటి



గోడమీద నిలబడి రెక్కలార్చుకుంటూ వుంది.

"మిమ్మల్నే ఇరుగు పొరుగు ఎవరైనా చూస్తే ఏమిటమ్మా ఆ మనిషినలా వదిలేసారూ అన్నందుకా?"

"అవునమ్మా ఇంత పెద్ద వర్షంలో ఆ చలిలో అలా పడుకుంటే ఎవరైనా చూసినా మనకే అప్రదిష్ట!" అన్నాడు అటుగా వచ్చిన చిన్నకొడుకు.

"ఆ తర్వాత ఏమన్నావస్తే మనం ఏగలేక చావాలి" అంటూ వుంది ప్రక్కగదిలో నుండి పెద్దకోడలు.

"బాధలు సంగతి అటుంచు డాక్టర్ కోసం పరిగెత్తడాలు ఫీజులు డబ్బు డబ్బు ఎక్కడి నుండి తేవాలి?" పెద్దకొడుకు కంఠం కంగున మోగింది.

రెండు, మూడు వేలిచ్చి కాలేజీ సీట్లు సంపాదించి, పదివేలదాకా దారబోసి ప్రభుత్వ ఉద్యోగాల్లో పడేసినంతవరకు అల్లల్లాడిపోయాడు.

"లేవండి ఇంకా ఏమిటలా? గదిలోకి పదండి, మిమ్మల్నే వినిపించడంలే?" అన్నపూర్ణ కేకపెట్టింది.

ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. చరచరా గదిలోకి నడిచాడు. పందిరిమంచంపైన కూర్చొని నిండుగా దుప్పటి కప్పుకొని చుట్టముట్టించబోయాడు.

"వెధవ చుట్ట.. పాడు వాసన... గదంతా ఖరాబు అవడానికి, ముందు అదిపారేయండి"! రుసరుసలాడింది అన్నపూర్ణ, చుట్ట వెలిగించే ప్రయత్నం మనుకున్నాడు.

అతని హృదయంలో అశాంతి. నోరు పిడచకట్టుకుపోతున్నట్లుగా వుంది. బెడ్ కాఫీ అలవాటు.

ఆగలేక అడిగాడు "అన్నపూర్ణ టీ అయిందా?"

"కోడలు చేతిలో పాంగిన్నె జారిపోయిందట.

ఏవో కాసిన్ని మిగిలాయి. ఇంట్లో వున్నవాళ్ళం ఎప్పుడైనా తాగొచ్చు. ముందు అబ్బాయిలకు పెడుతూవుంది. వాళ్ళు ఆఫీసులకు వెళ్ళిపోతే తాపీగా మనం తాగొచ్చు."

అన్నపూర్ణ బైటికెళ్ళిపోయింది. లేచిగుమ్మం దగ్గిరకొచ్చాడు. వరండాలో ఏదోపని చేస్తున్న రంగయ్య కనిపించాడు.

"ఒరే రంగయ్యా పేపరు ఎక్కడుందో కాస్తతెచ్చిపెట్టి ఇవ్వరా"? అన్నాడు.

"ఒరే విన్నేరా?" మళ్ళీ అన్నాడు.

"వుండండి సూసొత్తాను" రంగయ్య వంటగదివేపు వెళ్ళాడు. అంతే అరగంట గడిచిందిగాని రంగయ్య జాడలేదు.

కాళ్ళు నొప్పులు పుట్టాయి. కూర్చుందాం అనుకోబోయేటంతలో కోడలు అటుగావచ్చింది. "అమ్మాయ్ పేపరు ఒకసారిలా ఇస్తావూ.." అడిగాడు.

"ఆయన చదువుతున్నారు మామయ్యా" అంటూ వెళ్ళిపోయింది కోడలు. వూసూరంటూ కూర్చున్నాడు.

"ఇప్పుడేం తొందరొచ్చింది పేపరుకు పొద్దస్తమానూ ఖాళీయేగా!" అంటూ వచ్చింది అన్నపూర్ణ.

ఎప్పుడో 10 గంటలకు టీ, స్నానం,

జపం అంతా అయ్యాక పేపరు చదువుతూ కూర్చున్నాడు.

అప్పుడు వచ్చాడు రంగనాథం అనంతరామయ్య ఫ్రెండు.

ఇద్దరూ చదరంగం ముందు కూర్చున్నారు.

గుర్రాలు, ఏనుగులు అన్నీ పోగొట్టు కుంటున్నాడు అనంతరామయ్య.

"ఒరే రామయ్యా రిటైర్ అయిన తర్వాత నువ్వెందుకిలా ఓడిపోతున్నావో అర్థంకావడంలేదురా!" అన్నాడు రంగనాథం.

"విలువ— ఇంజనీర్ అనంతరామయ్య, రెండువేల జీతగాడు అనంతరామయ్య కున్నంత విలువ ఒట్టి సామాన్యమైన అనంతరామయ్యకు వుండదుకదా రామనాథం" అనంతరామయ్య బరువుగా నిట్టూర్పు విడిచా డు.

"నేనూ రిటైర్ అయ్యాను రామయ్యా.. నీలాగ నేనెప్పుడూ బాధపడలేదు. నావిలువ ఎప్పుడూ తరగలేదూ..."

"అదృష్టవంతుడివి", అనంతరామయ్య కళ్ళలో నీటి తెర కళ్ళద్దాలు తీసి తుడుచుకొని పెట్టుకొని నవ్వడానికి ప్రయత్నించాడు.

రంగనాథం అనంతరామయ్య భుజం తట్టాడు.

"ముందు జాగ్రత్తకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. సంపాదించినదాంట్లో కొంత నాభార్యకి, నాపిల్లలకి ఇచ్చినా నాబేంకు బేలన్స్ ఎంతో తెలుసా 50వేలు"!

అనంతరామయ్య ఆశ్చర్యంగా చూసాడు.

"అవునురా రామయ్యా.. ఇప్పుడు నేను రిటైర్ అయినా నా విలువ తగ్గలేదు. అప్పటిలాగే ఇంట్లో అన్నీ టైంకి సమకూరుతున్నాయి. ఆప్యాయతా, ఆదరణ అంతా అలాగే వున్నాయి. అంటే ఇంటి మనుష్యులుకూడా చివరకు భార్య కూడా డబ్బుంటేనే గౌరవిస్తుందని అని అనుకునే కంటే మనిషి మనసు అతి విచిత్రం ఇది అతి సహజం అని అనుకుంటే బాగుంటుం ది" అన్నాడు రంంగనాథం.

సరిగ్గా 10 రోజుల తర్వాత, ఉదయాన్నే లేచి హడావిడిగా తయారవుతున్న భర్తను చూసి—

"మీరేమన్నా ఉద్యోగానికి వెళ్ళాలా, ఊరెళ్ళాలా..తర్వాత చెయ్యొచ్చుగా" అంది గట్టిగా అన్నపూర్ణ. అనంతరామయ్య నవ్వుగా నవ్వి "కరెక్టుగా చెప్పావ్ అన్నపూర్ణా ఇప్పుడు నేను ఉద్యోగానికే వెళ్లేది.

మిషన్‌టూల్స్ కంపెనీలో పదిహేనువం దల జీతానికి చేరాను."

ఇంటిల్లిపాది అప్పటికే అక్కడికి చేరారు. సంభ్రమాశ్చర్యాలతో ఆయన్నే చూస్తున్నారంతా. తన విలువ ఏదో పెరిగినట్టుగా అనిపించింది అనంతరామయ్యకి.

ఆ తర్వాత తన జీతాన్ని ఇంట్లో ఒక్కపైసా ఖర్చుపెట్టకుండా తన ఎకౌంట్‌లో వేసుకుంటున్నప్పటికీ అనంతరామయ్య విలువ తగ్గలేదు.

పైగా అప్పటికంటే అతని విలువ రెట్టింపు పెరిగింది. మనిషి మనసు అవి నవ్వుకున్నాడు అనంతరామయ్య

❀